తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

ఎర్రచందనం కేసులో ప్రమేయం ఉన్న కానిస్టేబుల్ అరెస్టు

ఎస్పి ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6, ప్రభాతవార్త

ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నమోదు చేసిన ఒక కేసులో ఎర్రవారిపాలెం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చలమకుంట గురప్పకు ప్రమేయంతో పాటు కేసులో ఉన్న ముద్దాయిలతో సంబంధాలు కలిగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సదరు కానిస్టేబుల్ ఏ4 ముద్దాయికి మధ్య సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో కూడా నిర్ధారణ అవడంతో ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, రెడ్ సెండెల్ టాస్క్‌ఫోర్స్ ఆదేశాల మేరకు పోలీసులు సదరు కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు. ఇప్పటికే అదే కానిస్టేబుల్ రెండు నెలల క్రితం అవినీతి కార్యకలాపాలకు పాల్పడినందుకు సస్పెన్షన్‌లో కొనసాగుతున్నాడని ఎస్పి తెలిపారు.

ఎస్‌డికె నగర్‌లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్?

శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణానికి తూర్పున అభివృద్ధి చెందుతున్న ఎస్‌డికె నగర్ దొంగలు, మందుబాబులకు అడ్డాగా మారింది. బుధవారం వేకువ జామున ఈ ప్రాంతంలో చెడ్డీగ్యాంగ్‌గా అనుమానిస్తున్న వ్యక్తులు హల్‌చల్ చేసినట్లు భావిస్తున్నారు. పట్టణానికి తూర్పున వున్న ఎస్‌డికెనగర్ టూటౌన్‌పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. పోలీస్‌స్టేషన్ ఎస్‌డికె నగర్‌కు ఉత్తరాన చర్చి ప్రక్కన వుంది. సిబ్బంది పట్టణంలోకి రావాలంటే చెన్నై- నాయుడుపేట బైపాస్ నుంచి ఎస్‌డికె నగర్ మీదుగా రావాల్సి వుంటుంది. బుధవారం ఉదయం వేకువ జామున చెడ్డీగ్యాంగ్‌గా అనుమానిస్తున్న వ్యక్తులు ఓ ఇంటిలో చొరబడినట్లు సమాచారం. అయితే బుధవారం రాత్రి వరకు ఈ అంశానికి సంబంధించి పోలీసులు ధృవపరచలేదు. టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా విచారిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌డికె నగర్ దినదినాభివృద్ధి చెందుతూ అపార్టుమెంట్లు, మల్టీస్టోరేజ్ భవనాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. గత రెండు నెలల నుండి ఈ ప్రాంతంలో చోరీలు జరుగుతున్నాయి. దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అయితే ఇక్కడ పోలీసులు గస్తీ పెంచాల్సి వుంది. రాత్రి 10.30గంటలకు పోలీసులు గస్తీ తిరిగి వెళ్తున్నారు. చోరీ సంఘటనలు వేకువ జామున జరుగుతున్నాయి. బుధవారం వేకువ జామున ఓ ఇంటిలో ముసుగు ధరించిన వ్యక్తి వరండాలో సంచరించడం లిఫ్టు ప్రక్కన గల మెట్లపై నుండి పైకి వెళ్ళినట్లు సిసి ఫుటేజీలో రికార్డు అయింది. అయితే అక్కడ ఏం జరిగిందన్నది బుధవారం రాత్రి వరకు బయట పడలేదు. ఈ ప్రాంతాల్లో పోలీసులు గస్తీ పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది. బుధవారం ఇక్కడ సంచరించింది చెడ్డీగ్యాంగా? లేక దొంగలా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి వుంది.

భక్తుల సేవకు సమిష్టి కృషి

-సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తాం

-టిటిడి నూతనఛైర్మన్ బిఆర్‌నాయుడు

తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

గోవింద నామస్మరణతో తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు, పాలకమండలి సమిష్టిగా కృషి చేస్తుందని,తిరుమల పవిత్రతను కాపాడటమే తమ ధ్యేయమని టిటిడి నూతన ధర్మకర్తలమండలి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు(బిఆర్‌నాయుడు) తెలిపారు. వస్తున్న సామాన్యభక్తులకు మరింత సౌకర్యవంతంగా స్వామివారి దర్శనం చేయించడమే తమ ప్రాధాన్యతగా చెప్పారు. అన్యమత ప్రచారం జరిగితే చర్యలు తప్పవని తొలిసమావేశంలోనే స్పష్టం చేశారు. టిటిడి ధర్మకర్తలమండలి 54వ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఆయన సాయంత్రం అన్నమయ్యభవనంలో టిటిడి ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి జఈఓ వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓలు భాస్కర్, హరీంధ్రనాథ్, సిపిఆంఓ డాక్టర్ తలారి రవి, ఐటి జిఎం శేషారెడ్డి, ఇతర విభాగాధిపతులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ధర్మకర్తలమండలి సమావేశంలో ఇంకా పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నామని ఛైర్మన్ నాయుడు తెలిపారు.

చిన్నవయస్సులోనే కొండకు నడిచివచ్చేవాడిని



తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

ఉమ్మడిచిత్తూరుజిల్లావాసిగా పుట్టడం అదృష్టమైతే....ఇక్కడే కొలువైన ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి సేవచేసుకునే భాగ్యం కలగడం తనకు స్వామివారిచ్చిన గొప్పవరమని టిటిడి బోర్డు నూతన ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు(బిఆర్ నాయుడు)విశ్వాసం వ్యక్తం చేశారు. చిన్నవయస్సులోనే తాను కొండకు నడచుకుని వచ్చి స్వామివారిని దర్శించుకునేవాడినని పాతరోజులను గుర్తుచేసుకున్నారు. అంతటి మహాకార్యం ప్రస్తుతం దేవుని దర్శనానికి వస్తున్న లక్షలాదిమంది భక్తులకు మరింత సేవలందించేందుకు తనకు ఆ దేవుడిచ్చిన అవకాశమని తెలిపారు. 54వ టిటిడి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు బుధవారం ఉదయం ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటం,తీర్థప్రసాదాలు అందజేశారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

నాయుడుపేట నవంబరు 6 ప్రభాతవార్త ;

నాయుడుపేటలో పట్టణంలో పోలీసుల బెదిరింపులకు మనస్తాపం చెందిన లక్ష్మిప్రియ(18).అనే యువతి ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మెరకు.. నాయుడుపేట పట్టణంలోని సప్తగిరిరైస్‌మిల్లు సమీపంలో నివాసం ఉంటున్న లక్ష్మిప్రియ గత ఎడాది నుండి ఎక్స్‌ట్రా మార్టులో పనిచేసుకొంటూ జీవనం సాగిస్తుంది. మంగళవారం ఎక్స్‌ట్రా మార్టులో నగదు తేడా రావడంతో యాజమాన్యం లక్ష్మిప్రి యను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు.ఎక్స్‌ట్రా మార్టులో తేడా వచ్చిన నగదును తిరిగి చెల్లించాలని లేనిపక్షంలో కేసునమోదు చేస్తామని పోలీసులు-ఎక్‌ట్రామార్టు యాజమాన్యం బెదిరించడంతో మనస్తామనికి గురైన లక్ష్మిప్రియ ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. యాజమాన్యం నాకుమార్తెను పోలీసు స్టేషన్‌కు పిలిపించి అవమానం చేయడం వల్లన మనస్తానం చెంది ఆత్మహత్య చేసుకొని మృతిచెందడానికి కారణమైన ఎక్స్‌ట్రామార్టు యాజమాన్యం-పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లక్ష్మిప్రియ మృతదేహన్ని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భర్తే హతమార్చాడు

శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలో అక్టోబర్,3 జరిగిన ఓ మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు చేధించారు. భర్తే భార్యను హతమార్చినట్లు విచారణలో వెల్లడైందని సిఐ రవి వివరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. తొండమనాడు గ్రామసమీపంలో బర్రె హేమభూషణ్‌రెడ్డి ఇటుకల బట్టీ వద్ద చెంచయ్య, అతని భర్త తుపాకుల బత్తెమ్మ కూలి చేసుకొని బ్రతికేవారు. అయితే అక్టోబర్, 3 రాత్రి బత్తెమ్మ గాయాలతో మృతిచెందింది. ఈ కేసుకు సంబంధించి విచారణ జరపగా చెంచయ్యకు రెండవ భార్య వుండేదని, ఆమె పేరు వెంకటమ్మ అని విచారణలో తేలిందని సిఐ వివరించారు. అయితే చెంచయ్యను మూడవ భార్య బత్తెమ్మ తరుచూ రెండవ భార్య వెంకటమ్మ, ఆమె పిల్లలతో ఇతర మహిళలతో మాట్లాడొద్దంటూ వేధించేదని నిందితుడు చెంచయ్య వివరించినట్లు తెలిపారు. ఆమె బాధను తొలగించుకొనుటకు అక్టోబర్ 3 రాత్రి కర్రతో శరీరం, తలపై బలంగా కొట్టడంతో స్పృహతప్పి పడిపోయిందని, ఎంత లేపినా లేవకపోవడంతో ఆమె చనిపోయిందని నిర్ధారించుకొని శవాన్ని తాము నివసిస్తున్న షెడ్డుకు వెనుక ఇటుకల తయారీకి ఉపయోగించి మట్టిదిబ్బల వద్ద పడేసి తన స్వగ్రామమైన దొరవారి సత్రం మండలం తల్లూరు గ్రామూనికి వెళ్ళినట్లు నిందితుడు వివరించినట్లు తెలిపారు. బుధవారం రెండవ భార్యవెంకటమ్మ తొట్టంబేడు మండలం రౌతుసూరమాల శాస్త్రికాలనీలో నివాసముంటున్నారు. చెంచయ్య అక్కడకు రాగా వెంకటమ్మ పంచాయితీ గ్రామరెవెన్యూ అదికారి శంకరయ్య ద్వారా తమ వద్ద లొంగిపోయినట్లు సిఐ వివరించారు. ఈ మేరకు బుధవారం అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడికి పంపినట్లు సిఐ వివరించారు.

క్రీడల్లో తిరుపతి జిల్లాను ప్రథమస్థానంలో నిలబెడతాం

జిల్లా క్రీడా సదుపాయాలపై కలెక్టర్‌తో శాప్ చైర్మన్ రవినాయుడు భేటీ .. నేనూ క్రీడాకారుడినే :కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి క్రీడ, నవంబర్ 6, ప్రభాతవార్త

క్రీడల్లో తిరుపతి జిల్లాను ప్రథమస్థానంలో నిలబెడతామని పక్కా ప్రణాళికలతో అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ని తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నర్సింహాయాదవ్‌తో కలిసి శాప్ చైర్మన్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ఆమోదించిన స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా తిరుపతి జిల్లాలో అమలు చేయనున్న విధానాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్ సిటీ నిధులతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మరమ్మతులు, సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా శ్రీకాళహస్తిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ చుట్టూ ప్రహారీ నిర్మాణానికి చర్యలు, జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి సెస్ నిధులు, అభి వృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్‌ని కోరారు. అలాగే నూతన క్రీడా విధానం అమలుకు యంత్రాంగం కూడా తోడ్పడితే క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని శాప్ చైర్మన్ కాంక్షించారు. క్రీడారంగాన్ని అభి వృద్ధి చేయడం నా బాధ్యతని, నేను కూడా క్రీడాకారుడినే అని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ బదులిచ్చారు. క్రీడలతో రాష్ట్ర, దేశ కీర్తి ప్రతిష్టతలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పొచ్చన్నారు. తిరుపతి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా చర్యలు తీసుకుని క్రీడారంగంలో తిరుపతి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా క్రీడారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసి శుభం బన్సల్, డిఎస్డిఓ సయ్యద్ సాహెబ్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులపై దాడి చేశారని సుపారి ఇచ్చి హత్య :పరారీలో నిందితులు

బాలాయపల్లి, నవంబర్ 6, ప్రభాతవార్త

కుటుంబ సభ్యులపై దాడి చేశాడని జయంపు గ్రామానికి చెందిన ఆలం లక్ష్మయ్యను సుపారి ఇచ్చి హత్య చేయించిన సంఘటన జరిగింది. నాలుగు రోజుల క్రితం జనార్ధన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి లలితమ్మలను లక్ష్మయ్య కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఎస్ఐ కామినేని గోపి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబంపై లక్ష్మయ్య దాడి చేశాడని మనసులో పెట్టుకున్న కార్తీక్ రెడ్డి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా తిరుపతికి చెందిన సుపారి గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకొని టెంపో వ్యాన్‌లో జయంపుకు తీసుకుని వచ్చారు. లక్ష్మయ్య ఇంట్లో ఉండగా పోలీసులు పిలుస్తున్నారని తీసుకొని వెళ్లి జయంపు హస్తకావేరి మధ్య రోడ్డులో తీవ్రంగా కొట్టి గాయపరిచి విదిలి పరారి వెళ్లారు. అయితే గ్రామస్తులు లక్ష్మయ్య పడి ఉండడానికి గుర్తించి నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మయ్య మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకేసులో ముగ్గురు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఏవి రమణ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. క్లూస్ టీం కూడా దుస్తులు చుట్టుపక్కల పడి ఉన్న పరికరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతతో సిమెంటు రోడ్ల నిర్మాణం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, నవంబర్ 6 ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన అంతర్గత సిమెంటు, కాంక్రీట్ రోడ్ల నిర్మాణాలను నాణ్యత పరిశీలించాలని కలెక్టర్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సిమెంటు రోడ్ల పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను సత్వరం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధానంగా 1,503 సిమెంటు అంతర్గత రోడ్ల నిర్మాణాలు మంజూరు అయ్యాయని, ఇందులో 13 కోట్ల రూపాయలతో ఇప్పటికే 248 పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే ఇందులో 8 కోట్ల రూపాయలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేయడం జరిగిందని, 2.50 కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సత్వరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలఉ చేపట్టాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం జరిగే సమయంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు నాణ్యతను పరీక్షిస్తుండాలని స్పష్టం చేశారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద చేపట్టే ఇతర పనులను విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ప్రతిపాదనలు పంపాలన్నారు. డ్వామా పిడి రవికుమార్, పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిఇలు, ఎఇలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6, ప్రభాతవార్త

పోషకాహార లోపం నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్‌లో మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై సిడిపిఓలు, సూపర్‌వైజర్లు తదితరులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు కిషోర్ వికాస్ పథకం అమలు పోషకాహార లోపం సాదన దిశగా కృషి చేయాలని తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడి పనితీరు, అందే సేవలతో పాటు బాలికల సంరక్ష ణపై ప్రత్యేక శ్రద్ధ చూపాడంతో పాటు బాలికల మీద జరుగుతున్న అత్యాచారాలు, వాటిని నుండి బాలికలు ఎదుర్కొని మార్గాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్య వివాహాల నివారణ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిసిపిఓ శివ శంకర్, సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

రూ.450 కోట్లతో కుప్పం మున్సిపల్ అభివృద్ధికి ప్రతిపాదనలు

కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి దాదాపు 450 కోట్లతో ప్రతిపాదనలు పంపామని అందులో మొదటి దశకింద రూ 50కోట్ల రూపాయల నిధులను సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేశారని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండల కార్యాలయంలో కుప్పం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా చేయడమే తమ అజెండా అన్నారు. ఎన్నికలు ముగిసిపోయాయని రాజకీయాలు పక్కనపెట్టి అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలి విడత కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) కింద మంజూరైన యాభై కోట్ల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ తదితర పనులు చేపడ్తామన్నారు. ఈ పనుల పూర్తికి సిఎం చంద్రబాబు ఆరు నెలల కాలం కేటాయించారన్నారు. అనంతరం మలిదశలో మరోమారు నిధులు మంజూరవుతాయని అలా ప్రణాళికాబద్ధంగా కుప్పం మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండును 60 కోట్ల నిధులతో పూర్తిగా ఆధునీకరించడం జరుగుతుందన్నారు. కుప్పం మున్సిపల్ అభివృద్ధికి సిఆర్‌డిఎ అధికారుల బృందం సైతం పనిచేస్తోందన్నారు. వారు కూడా తగు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీకి కమీషనరుగా సమర్థవంతమైన అధికారి శ్రీనివాసరావును సిఎం చంద్రబాబునాయుడు నియమించారన్నారు.

వైకాపా కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరు :

మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తెదేపా తరపున ఉన్న కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. వైఎస్సార్సీ కౌన్సిలర్లు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. సమావేశం నిర్వహణకు తగు కోరం ఉండడంతో కమీషనర్ శ్రీనివాసరావు సమావేశాన్ని ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారాన్ని అడ్డుపెట్టి.. ప్రకృతి సంపదను కొల్లగొట్టి..!

చిట్టమూరులో యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా - చోద్యంచూస్తున్న అధికారులు

ఇసుక రీచ్‌లో భారీగా ఏర్పడిన గుంతలు. అక్రమంగా తరలిపోతున్న ఇసుక, గ్రావెల్

చిట్టమూరు, నవంబర్ 6 ప్రభాతవార్త

అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తామని, అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్న తెలుగుదేశం పార్టీ పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. అధికారాన్ని అడ్డుపెట్టి ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. గొర్రెలు తినేవాడితో పాటు బర్రెను తినేవారు ఉన్నారన్న చందంగా పాలకుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిట్టమూరు మండలంలో యథేచ్ఛగా నిత్యం ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారానికి ఐదేళ్లు దూరంగా ఉన్న నాయకులు అక్రమ సంపాదనే లక్ష్యంగా అధికారులను అడ్డుపెట్టుకొని ప్రకృతి సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. పేదల అవసరాలకు మట్టి, గ్రావెల్, ఇసుక తరలించాలంటే ఆగమేఘాల మీద వాలిపోయి కొరడా ఝుళిపించే అధికారులు.. అక్రమంగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిపోతున్నా పట్టించుకునేవారు లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలు రోజురోజుకి మితిమీరిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని మెట్టు సమీపంలో స్వర్ణముఖి నదిలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి వివాదాస్పదం కావడంతో పాటు విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించి కొల్లగొట్టారు. అప్పట్లో ఇదే అంశం జిల్లాస్థాయిలో చర్చనీయాంశమై పలు రాజకీయ వివాదాలకు వేదికై రైతులు, స్థానికులు నష్టపోతారన్న సొంత పార్టీ నేతలు గొంతెత్తి నిరసన వ్యక్తం చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. కోట్లాది రూపాయల విలువైన ఇసుక స్వర్ణముఖి నది నుంచి తరలివెళ్లగా, ఈ ప్రాంత రైతాంగానికి అవసరమైన భూగర్భజలాలు అడుగంటి ఇక్కడ ఏర్పాటైన తాగునీటి పథకాలకు నీరందక.. నేతల విచ్చలవిడి తవ్వకాలతో భారీ గోతులు సైతం ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో పడి ఇప్పటికే పలువురు అభాగ్యులు ప్రాణాలు కోల్పోగా, మంగళవారం ఓ విద్యార్థి సైతం ఈతకు వెళ్లి గుంతలో పడి మృతిచెందారు. పలు మూగజీవాలు సైతం ఇసుక గుంతల్లో పడి మృతిచెందిన ఘటనలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి కంచుకోటగా ఉన్న మెట్టు, గునపాడు, గునపాటిపాలెంతో పాటు స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోని ప్రజలు తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ ఇచ్చి అధికారం కట్టబెట్టారు. అయితే ప్రభుత్వం, పాలకులు మారినా స్వర్ణముఖి ఇసుక రీచ్ నుంచి నిత్యం కొందరు బడానాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా ఇసుక భారీ టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిపోతోంది. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా అక్రమ మాఫియా చెలరేగిపోతుందంటే అతిశయోక్తి కాదు. మెట్టు సమీపంలోని స్వర్ణముఖి రీచ్‌ను వ్యాపార కేంద్రంగా మార్చేసిన ఓ వ్యాపారవేత్తతో పాటు కొందరు అధికార పార్టీ నాయకులు సూళ్లూరుపేట, తడ, చెన్నై, ఆరంబాకం తదితర ప్రాంతాలకు ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై కొద్దిరోజుల క్రితం స్థానికంగా పోలీసులకు ఫిర్యాదులు అందడంతో సుమారు 9 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు క్షణాల్లోనే ఆగమేఘాల మీద వాటిని వదిలేయడం వెనుక బలమైన రాజకీయ శక్తి ఉందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల గృహాల అవసరాలకు యల్లసిరి చెరువు నుంచి రెండు ట్రిప్పులు మట్టి తోలుకునేందుకు పేదలపై ఆంక్షలు విధించే అధికారులు, నాయకులు.. మూడురోజుల నుంచి చెరువులో ఎక్కడ పడితే అక్కడే గ్రావెల్, మట్టిని ఓ బ్రాందీషాపు నిర్మాణానికి అక్రమంగా తరలిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో అడిగే ధైర్యం లేకనా, లేక పచ్చనోట్ల వాసనకు అలవాటు పడ్డారో తెలియదు గాని అధికారులు మాత్రం సామాన్యులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు.

ఈ విఆర్వో మాకొద్దు బాబోయ్....

పుంగనూరు,నవంబరు 6 ప్రభాతవార్త : ఇపుడిపుడే ఎదుగుతున్న పట్టణంలోని నక్కబండ ప్రాంతానికి విఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటముని పేదలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ప్రజలు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్వోతో పాటూ ఆయన కుటుంబీకులు వసూళ్ళకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయనను తక్షణం విధుల నుంచి తొలగించాలని,లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలకు సిద్ధపడుతామన్నారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

భర్త అదృశ్యంపై పోలీసులకు భార్య ఫిర్యాదు

రామకుప్పం, నవంబర్6 ప్రభాతవార్త మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ ఆనిగానూరుకు చెందిన ఓ వివాహిత తన భర్త అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 16న ఆనిగానూరుకు చెందిన మంజునాథరెడ్డిని అమృత కులాంతర వివాహం చేసుకుంది. అప్పటినుంచి తనను మంజునాథరెడ్డి తల్లిదండ్రులు, బంధువులు ఫోన్ ద్వారా దుర్భాషలాడడంతో పాటు మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొంది. ఈనెల 5వతేది రాత్రి భోజనం తర్వాత తన భర్త కన్పించకపోగా చుట్టు పక్కల గాలించినా ఫలితం లేదని తన భర్త అదృశ్యానికి అత్త,మామ, బంధువులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నూతన ఎస్సైగా వెంకటమోహన్ బాధ్యతలు

రామకుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త

రామకుప్పం మండల నూతన ఎస్సైగా వెంకటమోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న శివకుమార్ చిత్తూరు విఆర్‌కు కొంతకాలం క్రితం బదిలీ అయ్యారు. దీంతో రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ ఇన్‌చార్జ్‌గా ఉండేవారు. ప్రస్తుత ఎస్సై వెంకటమోహన్ తిరుపతి నుంచి ఇక్కడకు వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా జరిగిన మండల మీట్

వి.కోట, నవంబర్ 6 ప్రభాతవార్త

వి.కోట మండల సర్వసభ్య సమావేశం బుధవారం ప్రశాంతంగా జరిగింది. గతంలో రెండుసార్లు సమావేశం నిర్వహణకు ఎంపిపి యువరాజ్ చర్యలు చేపట్టినా తెదేపా నేతలు అడ్డుకున్నారు. అయితే బుధవారం ఎంపిపి అధ్యక్షతన సమావేశం ప్రారంభమై సజావుగా ముగిసింది. మండలంలో ఆయా శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలని ఎంపిపి అధికారులను కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందించాలన్నారు. సమావేశంలో జడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపిడిఒ ఈశ్వరన్, తహశీల్దార్ పార్వతి, ఎపిఒ అశోక్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సుదర్శనమ్మ ఉత్తరక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

పెళ్లకూరు, నవంబర్ 6 ప్రభాతవార్త పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి తల్లి సుదర్శనమ్మ ఉత్తర క్రియలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పిటిసి ప్రిస్కిల్లా, యలసిరి గోపాల్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచులు ఆరూరు సుబ్బరాఘవయ్య, ప్రసాద్ యాదవ్, పాండురంగయ్య, ఆరూరు రవికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి యువ నేత కల్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పెళ్లకూరు, నవంబర్ 6 ప్రభాతవార్త పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి కుమారుడు, టీడీపీ యువ నేత వేలూరు కల్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆ గ్రామ యువత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి, కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ గ్రామ యువత పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్తల ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేసి నమోదు చేయించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. బుధవారం రైల్వేగేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటుకు జేసి స్థల పరిశీలన

పలమనేరు,నవంబర్ 6;ప్రభాతవార్త: పలమనేరు పట్టణంలో మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటుకు జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్థలాన్ని పరిశీలించారు.పట్టణంలోని పెద్దచెరువు సమీపంలో నూతనంగా మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదన ఉండగా అందుకు అనువైన స్థలం కావలసి ఉంది.ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌తో పాటు పలమనేరు ఆర్డీఓ భవాని,తహసీల్దార్ ఇన్బనాధన్,మున్సిపల్ కమీషనర్ రమణరెడ్డి స్థలాన్ని పరిశీలించారు.ఈ మేరకు జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటుకు ఎ.3.48 సెంట్ల భూమిని సిద్ధం చేపట్టనున్నామని పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో సమందిత రైతులతో చర్చించి స్థల సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు.అనంతరం గంటావూరులోని టెర్రకోటను సందర్శించిన ఆమె టెర్రకోటలోచేవడుతున్నబోమ్మలు,మట్టిపాత్రలను పరిశీలించారు.అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీల ద్వారా 11.12 లక్షలు ఆదాయం

తవణంపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 11.12 లక్షలు రూపాయలు ఆదాయంగా లభించింది. బుధవారం ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 90 రోజులకు గాను 11,11,788 రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆఫీసర్ సాయిలోచన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బందితో పాటు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవు తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తవణంపల్లె మండలం కె.పట్నంకు చెందిన సోమశేఖర్‌రెడ్డి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్పెక్టర్ రవిలకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తెదేపా నేత త్రిలోక్ కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ కింద 20లక్షల సాయం

కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త

కుప్పం తెదేపా కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డిఎస్ త్రిలోక్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఇరవై లక్షల రూపాయల చెక్కును బుధవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ అందించారు. ఈమేరకు చెక్కును త్రిలోక్ సతీమణి, తెలుగుమహిళ నాయకురాలు భాగ్యలక్ష్మి త్రిలోక్‌కు అందజేశారు. గతేడాది సెప్టెంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో త్రిలోక్ తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇదివరకే సిఎం చంద్రబాబునాయుడు బెంగళూరు ఆస్పత్రిలో త్రిలోక్ చికిత్స పొందుతుండగా అతన్ని పరామర్శించి పది లక్షల రూపాయల చెక్కును స్వయంగా అందజేశారు. ప్రస్తుతం కూడా మరో ఇరవై లక్షల సాయం అందించారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు వెంకీ,ఐటిడిపి అధ్యక్షుడు రాజేంద్ర పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై రైతులకు అవగాహన సదస్సు

కుప్పంరూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త రాష్ట్ర సమాచార కమీషనర్ ఆదేశాల మేరకు రైతులకు సమాచార హక్కు చట్టంపై వ్యవసాయాధికారిణి అమృతవల్లి అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తూ ఏ అధికారి నుంచి అయినా ప్రభుత్వ శాఖల సమాచారంను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సమాచారం ఇవ్వాల్సిన కాలపరిమితులు, అప్పీలుకు అవకాశం తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ ఔరంగ్, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పంటమార్పిడులతో తెగుళ్ల నివారణ సాధ్యం

శాంతిపురం, నవంబర్ 6 ప్రభాతవార్త

పంటమార్పిడులతో పంటల్లో తెగుళ్ల నివారణ సాధ్యమని ఎఒ అప్పోజి తెలిపారు. బుధవారం రెడ్లపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమని వివరించారు. ఎరువుల వాడకంపై రైతులకు తెలియజేశారు. ఆయాశాఖల ద్వారా ప్రభుత్వం రైతులకు వివిధ పంటలసాగుకు ఇచ్చే రాయితీలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో అధికారులు రవీంద్రనాథ్, రామూర్తి, మాజీ సర్పంచ్ మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఉద్యానవన శాఖ డిడి మధుసూదన్ రెడ్డి

సోమల, నవంబర్ 6, ప్రభాతవార్త రైతులకు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజ ల్లోకి తీసుకువెళ్లి అవి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ డిడి మధుసూధన రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మామిడి రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. ప్రస్తుతం మామిడి రైతులు చేయాల్సిన పనులు గురించి వివరించారు. పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చౌడేపల్లి ఉద్యానవనశాఖఅధికారి సంతోషిని రైతులకు తెలిపారు. రైతులు, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలాలలో అదనపు పనులు మంజూరు

సోమల, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త

ప్రభుత్వం సోమల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో మరిన్ని అదనపు పనులు మంజూరు చేసినట్లు ఏపిఓ దినకర బాబు అన్నారు. సోమల గ్రామ సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు పనులు కల్పించడంతో పాటు, రైతులకు ఉపయోగంగా ఉండే పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ సావిత్రమ్మ, వైస్ ఎంపిపి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్

– మండల సమస్యలపై ఆరు నెలలుగా జరుగని చర్చ

పాలసముద్రం, నవంబర్ 6 ప్రభాతవార్త: మండల సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించడానికి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. గత ఆరు నెలలుగా మండల సమస్యలపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించకపోవడం పట్ల మండల ప్రజానీకంలో ఆవేదన నెలకొంది. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిపి శ్యామల శివప్రకాష్ రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత మూడు నెలల క్రితం జరుగాల్సిన మండల సర్వసభ్య సమావేశం అప్పట్లో కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. మళ్ళీ మూడు నెలలకు బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఇటు ప్రజా ప్రతినిధులు, అటు మండల అధికారులు నామమాత్రంగా హాజరై మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి చర్చ లేకుండా ముగించి వెళ్ళిపోయారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆరు మంది ఎంపిటిసీలు హాజరు కావాల్సి వుండగా కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. అలాగే 12 మంది సర్పంచ్‌లు హాజరు కావాల్సి వుండగా సమావేశానికి కేవలం 7 మంది సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. తక్కువ మంది ప్రజాప్రతినిధులు హాజరు కావడం, సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు సైతం సమస్యలను ప్రస్తావించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుని సమావేశం నుండి బయటపడ్డారు. ఈ పరిస్థితుల్లో రానున్న రోజుల్లో జరుగనున్న మండల సర్వసభ్య సమావేశాల్లోనైనా పూర్తి స్థాయి ఎంపిటిసీలు, సర్పంచ్‌లు హాజరై మండల సమస్యలపై సమావేశంలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

10న మెగా డిఎస్సీ అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్

చిత్తూరు, నవంబర్ 6 ప్రభాతవార్త: మెగా డిఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎపి ప్రభుత్వం సాంఘీక సంక్షేమశాఖ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డిఎస్సీ ద్వారా ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని కలెక్టర్ కోరారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్ చిత్తూరులోని మురకంబట్టు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల, పూతలపట్టు మండలం పి.కొత్తకోట వద్ద గల వేము ఇంజనీరింగ్ కళాశాల, గంగవరం మండలంలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగనుందని ఆయన తెలిపారు.

ఉల్లాస్ విజయవంతంకు కృషి

గుడిపాల, నవంబర్ 6 ప్రభాతవార్త: ఈ నెల 8వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఉల్లాస్ కార్యక్రమంను మండల పరిధిలో విజయవంతం చేయాలని వెలుగు ఎపిఎం సుధారాణి, వయోజన విద్యాశాఖ అధికారి కందేశ్వరరావులు పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంపై విఓఎలు, అక్షర వాలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఎం సుధారాణి మాట్లాడుతూ పాఠశాలల్లో కుక్, నైట్ వాచ్‌మెన్లతో పాటు ఎంపికైన 198 మందికి పాఠశాల అనంతరం సాయంత్రం వేళల్లో 2 గంటల పాటు వారికి విద్య బోధించి వారికి ఆర్థిక పరంగా డిజిటల్ పరంగా అక్షరాస్యులను చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో వెలుగు సిసి లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

బిసి కుల జనగణన మహధర్నా విజయవంతం చేయండి

: బిసి సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి నారయణ యాదవ్

వెంకటగిరిరూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త: ఈ నెల 12 నెల్లూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగే బిసి కుల జనగణన మహధర్నా విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి గెరిటి నారయణ యాదవ్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి జనాభను బట్టి పార్లమెంట్ అసెంబ్లీలలో సీట్లు రిజర్వేషన్లు చేయాలని డిమాండ్ చేశారు. బిసి సమనకవయ కమిటి రాష్ట్ర ఉపాధ్యాక్షలు నాశిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యతను గుర్తించడం ద్వారా ఉపాధి అవకాశాలు

డక్కిలి, నవంబరు 6 ప్రభాతవార్త; డక్కిలి మండలంలోని అన్నీ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది త్వరలో జరగనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేలో పాల్గొని పక్కాగా నిర్వహించాలని డక్కిలి ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన స్కిల్‌డెవలప్‌మెంట్ సర్వేకు సంబందించి సచివాలయాల ఉద్యోగులకు అవగాహన జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో భాగంగా డక్కిలి మండలంలో జరగుతున్నట్లు వివరించారు.సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఉద్యోగులకు ఇచ్చిన యాప్‌లో కుటుంబ సభ్యులు నైపుణ్యతను సర్వేద్వారా నమోదు చేయాలన్నారు. స్కిల్ డెవల్‌మెంట్ రీసోర్స్ పర్సన్‌గా ఈతముక్కల. గురవయ్య, పలు సచివాలయాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు మాలధారణ

చిల్లకూరు, నవంబర్ 6, ప్రభాతవార్త కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తమ్మినపట్నం గ్రామంలోని వెలసిన శ్రీశ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో అయ్యప్ప మాలధారణ వేసిన భక్తులకి నెలరోజుల పాటు అన్నదానం కార్యక్రమం మొదలు పెట్టారు. గూడూరు శాసన సభ్యులు డా. పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పెంచలకోన ట్రస్ట్ మాజీ చైర్మన్ తానంకి నానాజీ ఆదేశానుసారం శ్రీశ్రీ కోదండరామస్వామి దేవస్థానం తమ్మినపట్నం గ్రామంలో అయ్యప్ప భక్తులకి నిత్య అన్నదానం కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ ఎక్సిగ్యూటివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, ధర్మకర్త మండలి కోట సతీష్ యాదవ్, రామయ్య, సుబ్బయ్య, వెంకయ్య, సుధీర్, నాగరాజు, సర్పంచ్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, నవంబర్ 6, ప్రభాతవార్త

గూడూరు ప్రగతి సేవా సంస్థ బుధవారం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో పేద ప్రజలందరూ దేవుళ్ళుగా భావిస్తున్న డాక్టర్ సిఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా పేద ప్రజలు డాక్టర్ దేవుళ్ళుగా పిలవబడే డా. జనార్దన్ రెడ్డి, డా. రోహిణి సంపూర్ణ సహాయ సహకారాలతో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచడం కోసం ఎయిడ్స్ వ్యాధి బాధితులు 30 మందికి ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ జనార్ధన్ రెడ్డి డాక్టర్ రోహిణి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని కోరుకుంటూ డాక్టర్ మధు, అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు వాచీ షాప్ రాము, కుమార్ నాయుడు, మురళీ నాయుడు, శ్యామ్ కోట వెంకటేశ్వర్లు, సర్వేశెట్టి నాగరాజు, గోల్డ్ షాప్ మల్లీ కృష్ణారెడ్డి, శ్రావణ్ నాగేంద్ర హాస్పిటల్ స్టాఫ్ సాయి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

గూడూరు, నవంబర్ 6, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. హైదరాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై వివరించారు. అనంతరం డిఎస్పి వీవీ రమణ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్, గూడూరు, వాకాడు సిఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, హుస్సేన్ భాషా, ఎస్ఐలు తదితరులతో పాటు ఎవో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు

గూడూరు, నవంబర్ 6, ప్రభాతవార్త శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలల ఛైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మిబాయి జన్మదిన వేడుకలను పురస్కరించుకోని నోవా బ్లడ్ బ్యాంకు రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం గూడూరు బ్రాంచ్ నుండి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసులు, పాఠశాల డీన్లు శ్రీహరి బాబు, గాంధీ, నాసా ఇన్చార్జి అజయ్‌లు, ఉపాధ్యాయులు రక్తదానం చేసారు. రక్తదానం చేసినటువంటిని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎన్. శ్రీకాంత్ అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి సంత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్‌లు శ్రీహరి బాబు, హరి బ్రహ్మ యాదవ్, ప్రైమరీ ఇన్చార్జి చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

మాటుమడుగులో పాలం పిలుస్తోంది

డక్కిలి,నవంబరు 6 ప్రభాతవార్త;

డక్కిలి మండలం మాటుమడుగు,శ్రీపురం గ్రామాలలో బుధవారం పోలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డక్కిలి వ్యవసాయ అధికారి విజయభారతి,పశువైద్యాధికారి శ్రీకాంత్‌లు రైతులకు పలు సూచనలు ఇచ్చారు.విజయభారతి మాట్లాడుతూ రైతులు వరితో పాటు వాణిజ్య పంటలు సాగు చేయడం ద్వారా కుటుంబ ఆదాయం పెంపోందించుకోవాలని చెప్పారు. పశువైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ పంటలు సాగు చేయడంతో పాటు పశుసంపద ద్వారా ఆదాయం పెంచుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు శిక్షణా తరగతులు

కోట, నవంబర్ 6 ప్రభాతవార్త కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో బుధవారం ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఫైనలియర్ విద్యార్థులకు ఫీల్డ్ ప్రోగ్రాంబుల్ గేటెడ్ ఆర్ విత్ మెచిన్ లెర్నింగ్ బూట్ క్యాంప్ ఫ్రీపై రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్ సభ్యుడు డాక్టర్ మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు ఆకర్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. అమెరికా, యూరప్ దేశాలకు సంబంధించిన పలు సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు గుజర

విద్యార్థుల కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

తొట్టంబేడు, నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీస్వామి విద్యాప్రకాశనంద డిగ్రీ కళాశాల, జెకెసి మరియు కెరీర్ గైడెన్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కెరీర్ గైడెన్స్‌కు సంబందించి సెట్‌విన్ మరియు కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.నరసింహవర్మ, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ సి.బాపయ్య, జెకెసి మరియు కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.గంగారాం, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం మరియు సెట్‌విన్ మేనేజర్ మోహన్‌కుమార్, కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ ఎన్.రెడ్డి, మరియు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిటిడి పాలకమండలి సభ్యుడికి సత్కారం

శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త టిటిడి పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్‌గౌడ్‌ను వాలదాసు తోయజాక్షలుగౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా తోయజాక్షలు గౌడ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ఐటిశాఖ మంత్రి నారాలోకేష్ మరియు డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు గౌడ కులస్తులకు 2 మంత్రి పదవులు, ఆర్టీసి ఛైర్మన్ పదవి, టిటిడి పాలక మండలి సభ్యత్వం కల్పించి మరియు మద్యం దుకాణాల్లో 10శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ఎన్డీఏ కూటమి పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

లోబావి సెంటర్లో కొత్త బోర్ ఏర్పాటు: 45ఇళ్ళకు కనెక్షన్లు

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తి లోబావి బిసి కాలనీలో మంచినీటి సమస్య గురించిఎన్నికల ప్రచారంలో వెళ్ళిన తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి ప్రజల వివరించారు. ఇచ్చిన మాట మేరకు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి బోర్‌ను ఏర్పాటు చేయించారు. బుధవారం 26వ వార్డు ఇన్‌చార్జి అద్దంకి కిట్టు సారధ్యంలో భూమి పూజలను జరిపించారు. మున్సిపల్ కమిషనర్ బియస్ గిరికుమార్ సారధ్యంలో ఇంజనీరింగ్ అధికారులు బోర్ డ్రిల్లింగ్‌కు ఖరారు చేసారు. ఈ కార్యక్రమాలకు కిట్టు భూమి పూజలు జరిపారు.ఈ బోరులో చక్కగా మంచినీరు పడింది. ఈ బోర్ నుంచి కాలనీలోని 45ఇళ్ళకు ఉచితంగా ప్రభుత్వం అందించే ఇంటి కొళాయిలను ఏర్పాటుకు ఆదేశించినట్లు కమిషనర్ గిరికుమార్ వివరించారు. కార్యక్రమాల్లో తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు కిట్టు, 26వవార్డు ఇన్‌చార్జి అద్దంకి యశ్వంత్, కళత్తూరుజయప్రకాష్, కమల్, కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ పట్టణ కమిటి

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త

అఖిల భారత విద్యార్థి సమాఖ్య పట్టణ మహాసభ విక్రమ్ డిగ్రీకళాశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి కోగిల మునిచంద్ర హాజరయ్యారు. బుధవారం జరిగిన మహాసభలో నూతన పట్టణ కమిటిని ఎంపిక చేసారు. అధ్యక్ష కార్యదర్శులుగా చైతన్య, శివాలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కమిటిలో సభ్యులుగా రెహామాన్, హర్షవర్ధన్,చక్రి,పద్మావతి, మానస,బాబీ, కీర్తి, పద్మశ్రీలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమాల్లో సల్మాన్ బాలు,ప్రకాష్,చైతన్య,షాహీద్ విద్యార్థులు పాల్గొన్నారు.

పనబాకలక్ష్మికి టిడిపి నేతల అభినందనలు

తిరుపతి,నవంబర్ 6ప్రభాతవార్త:

టిటిడి బోర్డులో సభ్యురాలుగా నియమితులైన పనబాక లక్ష్మిని టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. బుధ వారం ఉదయం తిరుపతిలో ఆమెను కలసిన టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, డాక్టర్ రాళ్ళపల్లి సుధారాణి ఆమెను దుశ్శాలువతో సన్మా నించి, స్వామివారి చిత్రపటం బహుకరించారు. భక్తుల సేవలో మరింతగా సేవాభావంతో తరించాలని కోరారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

-ఎస్పీడిసిఎల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నెల్లేపల్లి మధుసూదనరెడ్డి

తిరుపతి,నవంబర్ 6ప్రభాతవార్త: విద్యుత్ సరఫరా,నాణ్యమైన విద్యుత్ అందే దిశగా వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎస్పీడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన నెల్లేపల్లి మధుసూదనరెడ్డి తెలిపారు. విద్యుత్ సంస్థపై, సేవలపై అవగాహన ఉన్న ఆయనను ప్రభుత్వం ఈ పదవిలో నియమించింది. తనపై బాధ్యత ఉంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, మంత్రి నారాలోకేశ్, విద్యుత్‌మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అన్ని విదాలా సహాయసహకారాలందించే ఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, టిడిపి నేత డాలర్ దివాకర్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

బాలాయపల్లి, నవంబర్ 6, ప్రభాతవార్త రోడ్లు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయితీరాజ్ ఏఈ సివి శ్రీకృష్ణయ్య కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని కయ్యూరు, అలిమిలి, గాజులపల్లి, కడగుంట గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలనికోరారు.నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఇంజనీరింగ్ సిబ్బంది కీర్తి, హేమంత్ రసీమ, వీరాస్వామి పోలయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

బాలాయపల్లి, నవంబర్ 6, ప్రభాతవార్త పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలం కామకూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సిపి నాయకులు కును రామయ్య తల్లి పుల్లమ్మ ఉత్తరక్రియలో వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పుల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు వెన్నోటి కార్తీక్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు రంగనాథం తదితరులు ఉన్నారు.

అధికారుల సలహాల మేరకే ఎరువులు మందులు వాడాలి

ఏడిఏ డాక్టర్ ఎం. నాగార్జున సాగర్

వెంకటగిరి, నవంబర్ 6, ప్రభాతవార్త రైతులు పంటలకు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు మేరకు ఎరువులు పురుగు మందులు వాడాలని వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. నాగార్జున సాగర్ తెలిపారు. తిమ్మాయగుంట, పెరియవరం గ్రామము లలో వ్యవసాయ అనుభంద శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ రాబోవు రబీ కాలము నందు సాగు చేయు వరి రకము పిఎన్ఆర్ 15048, సాగులో కొన్ని ముఖ్యమైన సమయం, సూచనలు పాటించడం వలన తెగుళ్ల, పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. రాబోవు కాలంలో కొర్ర, సజ్జ, మినుము పంటల రకములు, సాగు గురించి మండల వ్యవసాయాధికారి పి. సుజాత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు ఎస్పి రామ్మోహన్, గోపి కృష్ణ, గ్రామవ్యవసాయ సహాయకులు భాస్కర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పారిజాతం, కోటేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులు రబీ సాగుపై దృష్టి సారించాలి

బాలాయపల్లి, నవంబర్ 6, ప్రభాతవార్త రైతులు రబీ సాగుపై దృష్టి సారించాలని ఏవో శిరీష తెలిపారు. మండలంలోని నిండలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ కాలంలో వరి రకం పిఎన్ఆర్ 15048 సాగుపై పరిశోధన సలహాలు ఇచ్చారు. వ్యవసాయఅధికారుల సూచన సలహాలు మేరకు ఎవరువులు పురుగు మందులు వాడాలని సూచించారు.

వ్యవసాయ సాగుపై అవగాహన

వాకాడు, నవంబర్ 6, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులుకు వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. బుధవారం మండలంలోని నెల్లిపూడి, ముట్టెంబాక పంచాయితీలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది రమేష్ , నాయకులు, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లు పరిశీలిస్తున్న ఎంపిడివో అన్నపూర్ణరావు

వాకాడు, నవంబర్ 6, ప్రభాతవార్త వాకాడు మండలం కల్లూరు పంచాయితీ పరిధిలోని పల్లిపాలెం గ్రామంలో బుధవారం సిసి రోడ్డు పనులను ఎంపిడివో అన్నపూర్ణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో అన్నపూర్ణరావు మాట్లాడుతూ సిసి రోడ్లు పనులు నాణ్యత, సదరు పనులను వివరాలు గురించి ఇంజనీరింగ్ సిబ్బంది ద్వారా తెలుసుకు న్నారు. సిసి రోడ్డు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నాణ్యత పనులు లోటుపాట్లు ఉండకూడదని సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఇంజనీరింగ్ సహాయకులు కిషోర్, సురేఖ సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీవో సారూ....ఆధార్ కేంద్రాలపై దృష్టి పెట్టండి

సత్యవేడు, నవంబరు 6 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో పలు గ్రామాల నుంచి విద్యార్థులు, వృద్ధులు, ఇతరులు ఆధార్ దిద్దుబాటు కోసం నిరీక్షిస్తున్నారు. మండలంలో మూడు చోట్ల ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ప్రస్తుతం సత్యవేడు-3 సచివాలయంలో మాత్రమే ఆధార్ దిద్దుబాటు జరుగుతోంది. మిగిలిన రెండు కేంద్రాలు కూడా పని చేసే విధంగా ఎంపీడీవో చంద్రశేఖర్ చొరవ తీసుకోవాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. గంటల తరబడి ఆధార్ వద్ద అవసర పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వృద్ధులు, విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం మదనంబేడు, పెద్ద ఈటిపాకం సచివాలయాల్లోను ఆధార్ కేంద్రాలు పనిచేసే విధంగా చూడాలని, అలా చేయడం వల్ల ప్రధానంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవస్థలు తప్పుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాముల వారి ఆలయ అభివృద్ధికి చర్యలు

చంద్రగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: రాములవారి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయాన్ని బుధవారం ఆయన టిడిపి నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోదండరాముల వారికి కోనేరు నిర్మించడంపై దృష్టి సారిస్తానన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన రామాలయంలో ఆలయ అభివృద్ధికి టిటిడి నుండి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా చంద్రగిరిని అభివృద్ధి చేయడంలో ప్రతిష్టాత్మకంగా ముందడుగులు వేస్తున్నట్లు తెలిపారు. రామయ్య దర్శనార్థం ఉచిత బస్సులను ఇక్కడికి నడిపే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. టిటిడితో పాటు దాతల సహకారం తీసుకుని రాయలనాటి వైభవాన్ని ఆలయానికి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి ఫోన్ ద్వారా మంత్రి పరామర్శ

కేవీబీ పురం, నవంబరు 6 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం ఓలూరు ఎస్టీ కాలనీలో నివసించే మధు, మమతల కుమార్తె చెంచమ్మ చిన్నారిని అత్యాచారం చేసి చంపడం తెలుగుదేశం పార్టీ నాయకులను కలిచివేసింది. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌లు చిన్నారి చెంచమ్మ కుటుంబాన్ని ఫోన్ ద్వారా ఓదార్చి పరామర్శించారు. తప్పు చేసిన నిందితులను కచ్చితంగా శిక్షిస్తామని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. అలాగే ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, కేవీబీ పురం మండలం క్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామియాదవ్, ఓలూరు సర్పంచ్ సురేష్‌చౌదరి, తిరుపతి పార్లమెంట్ పాలేగార్ సంఘ అధ్యక్షుడు వెంకట కృష్ణయ్య, యువ నాయకులు వెట్టి అఖిల్, గ్రామ కమిటీ అధ్యక్షులు బాబుశెట్టి, రాయపేడు రఘు, విజయ్, పవన్, ప్రశాంత్, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు చిన్నారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

అన్ని పంచాయతీల్లో డ్రైనేజీలు, సీసీరోడ్లు నిర్మించాలి

కేవీబీ పురం, నవంబరు 6 ప్రభాతవార్త: 16 కోట్లతో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రతి మండలంలోని అన్ని పంచాయతీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు అభివృద్ధి పనులు ప్రారంభించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. యన మాట్లాడుతూ కోట్ల రూపాయలతో వివిధ రకాల పనులతో పాటు ఇరిగేషన్ పనులు మంజూరు చేయించి నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలాల్లో ఆ పంచాయతీల పార్టీ నాయకులకు వేరే వాళ్లు చేయడం లేదని ఇప్పటి కూడా ఏదన్నా పంచాయతీలు అవసరమైన పనులను గుర్తించి జిల్లా కలెక్టర్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కేవీబీ పురం మండలంలో ఆర్డీవో తనిఖీలు

కేవీబీ పురం, నవంబరు 6 ప్రభాతవార్త: కేవీబీ పురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం తిమ్మ సముద్రం గ్రామంలో ఉన్న చెరువు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో వెంటనే అధికారుల బృందంతో గ్రామంలో ఉన్న చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ పరిశీలించి అధికారులు వెంటనే సర్వే నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఎవరైనా చెరువులు, కాలువలు ఆక్రమణ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ ప్రీడాపోటీలకు పరమేశ్వర మంగళం విద్యార్థి

పుత్తూరురూరల్, నవంబరు 6 ప్రభాతవార్త:

ఉమ్మడి అన్నమయ్య జిల్లా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో వాలీబాల్ క్రీడలో పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.వెట్రిసెల్వన్(8వ తరగతి) ఉత్తమ క్రీడా ప్రతిభ చూపి నవంబర్ నెలలో అరిక, విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌శెట్టి, కమిటీ ఛైర్మన్ మణికంఠ తెలిపారు. ఈ విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సహాయకులు సురేష్, నందకుమార్ అభినందనలు తెలియజేశారు.

సిపిఎం ప్రాంతీయ కార్యదర్శిగా గంధం మణి

శ్రీకాళహస్తి నవంబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని స్థానిక పుచ్చలపలి సుందరయ్య భవన్‌లో బుధ వారం సిపిఎం ప్రాంతీయ ప్రప్రథమ మహాసభ జరిగింది.ఈ మేరకు శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల సిపిఎం శాఖల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరైయ్యారు.పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి సుందరయ్యభవన్ వరకు ప్రజానాట్యమండలి కళాకారులు డప్పుల వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసినాగరాజు హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి దొపిడి విధానం జడలు విప్పుతున్న కారణంగా నిమ్నవర్గాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అనంతరం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంతీయ సిపిఎం కమిటినిఏకగ్రీవంగాఎన్నుకున్నారు.సభ్యులుగా గురవయ్య,ధనంజయులు, కుమార్, వెంకటేష్, రాధమ్మ, శ్రీనివాసులు,రమణయ్యనుఎన్నుకున్నారు.సిపిఎంనేతలుఅంగేరిపుల్లయ్య,ధ్రాసరిజనార్దన్‌లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్టవేస్తాం..సిఐ

తొట్టంబేడు, నవంబర్ 6 ప్రభాతవార్త మండలంలో ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేస్తామని సిఐ తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రభుత్వం నిర్దేశించిన రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు చేపట్టవచ్చని కేవలం ట్రాక్టర్ల ద్వారానే తరలించాలని, జెసిబిలు, టిప్పర్లు, లారీలకు అనుమతి లేదన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్సులు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను అధికవేగంతో నడపడం వంటి చేపట్టరాదని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్‌కు లైసెన్సులు, వాహనాలకు సంబందించిన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

బాధితులకు న్యాయం-మోసగాళ్ళకు శిక్ష

-తేదేపా రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి

.శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త ప్రభుత్వ సంపదను అప్పనంగా అమ్మేసి దర్జాగా దొంగ సొమ్మును జేబులో వేసుకుని గత ఐదేళ్ళూ పాపాల భైరవుని సంరక్షణలో ఉన్న దోపిడీ రాయుళ్ళపై పిర్యాదు చేసిన బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని అలాగే మోసపూరితమైన కుట్రతో ప్రభుత్వ ఆస్తిని దురాక్రమించి నకిలీ పట్టాలను సృష్టించి వాటిని అమాయకమైన ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్న వారిపై క్రిమనల్ చర్యలు తీసుకోవాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి బిసి విభాగం నాయకులు డాక్టర్ యం.ఉమేష్‌రావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది బయటపడిన నకిలీ పట్టాలు వ్యవహారంలో లోతైన సమగ్ర విచారణ జరపకుండా, ఆరోపణలు ఉన్న వాటిపై వైసిపి నాయకులను తప్పించి తూతూ మంత్రంగా విచారణ పూర్తి చేసి శ్రీకాళహస్తి పట్టణం, రెండోపట్టణ పోలీస్‌స్టేషన్‌లో నామమాత్రంగా నమోదు చేసిన కేసును పునర్విచారణ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తనిఖీలు

శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త

పాన్ ఇండియా బాలకార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మికశాఖ అధికారులు, మండల లీగల్ సర్వీస్ అథారిటీ మరియు ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలసి శ్రీకాళహస్తిలోని బిపి అగ్రహారం వీధి, ప్రాజెక్టువీధి, దర్గామిట్ట, పానగల్‌రోడ్డు, ఆర్టీసి బస్టాండు రోడ్డు, కొత్తపేట మరియు బహదూరుపేట వీధుల్లో దుకాణాలను తనిఖీలు నిర్వహించి నాలుగురు బాలకార్మికులనుగుర్తించారు. సహాయ కార్మిక కమిషనర్ తిరుపతి చిన్నలాలప్ప శ్రీకాళహస్తి సహాక కార్మిక అధికారి జి.రంగనాథ్, మరియు తిరుపతి సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ప్రగతి స్వచ్ఛంధ సంస్థ మరియు న్యాయశాఖ సిబ్బంది పారా లీగల్ వాలంటీర్లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో నైపుణ్యగణన కార్యక్రమాలు

శ్రీకాళహస్తిరూరల్ నవంబర్ 6 ప్రభాతవార

శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక చేపట్టిన నైపుణ్యాభివృద్ధి గణన కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టాలని ఎంపిడిఓ రఫీఖాన్ బుధవారం జరిగిన సమావేశంలో పిలుపు నిచ్చారు.మండల పరిషత్ కార్యాలయంలో మండల నైపుణ్యాభివృద్ధి అధికారి మోహన్ అధ్యక్షతన గ్రామ పంచాయతీలు, కార్యదర్శులు, పంచాయతీ సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, దానికి అనుగుణంగా ప్రభుత్వం కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఎంపిడిఓ రఫీఖాన్ మాట్లాడుతూ 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు కల్గిన విద్యార్థులు, ఉద్యోగం, అనుభవం, స్వయంఉపాధి,సొంత వ్యాపారం గురించిన సమాచారాన్ని ప్రభుత్వం అందించిన ప్రశ్నావళిలో నింపాలని రఫీఖాన్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

గణితశాస్త్ర విభాగంలో ఆచార్య హనుమంతాచారి సేవలు శ్లాఘనీయం

తిరుపతి విద్య, నవంబర్ 6, ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో మొదటి తరం అధ్యాపకులలో ఆచార్య జె.హనుమంతచారి సేవలు శ్లాఘనీయమని,ఆమోఘమని గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి.జయసుబ్బారెడ్డి పేర్కొన్నారుజెస్వీయూలోని గణిత శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో బుధవారం ఇటీవల మరణించిన ఆచార్య జె.హనుమంతాచారి సంతాప సభను నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఆచార్యులు.అధ్యాపకులు,పరిశోధకులు,విద్యార్థులు ఆచార్య హనుమంతచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య జయసుబ్బారెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్ర విభాగంలో ఆచార్య హనుమంత ఆచారి విభాగాధిపతిగా పరిపాలన కొనసాగించారని కొనియాడారు.ఎస్వీయూలో దాదాపుగా 35 సంవత్సరాల పైగా ఆచార్యులుగా విధులు నిర్వహించారని వెల్లడించారు. ఆయన సేవ,నిబద్ధత నిజాయితీకి మారుపేరని కొనియాడారు.ఈ గణిత శాస్త్ర అధ్యాపకులు ఆచార్యులు భాస్కర్ రెడ్డి,విశ్వనాథ్ రెడ్డి,సుగుణమ్మ, భారతి, సుధాకరయ్య, శ్రీనాథ్,రామకృష్ణ ప్రసాద్,వెంకటరమణ,పరిశోధకులు అకడమిక్ కన్సల్టెంట్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో దంత సంరక్షణపై అవగాహన

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాతవార్త: స్థానిక బైరాగి పట్టెడ నందు గల శ్రీ గోవింద రాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దంత సంరక్షణ మరియు పరీక్షలు గురించిన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరి గింది.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి,దంత సంరక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్,ఐక్యూఏసి కోఆర్డినేటర్ డి.పరమేశ్వర, ఎన్.ఎస్.ఎస్ఆఫీసర్లుడా.పి శివకుమార్,బి.సులోచనా నాణి,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల, దామలచెరువులో ట్రాఫిక్, సమస్యలు తీరేనా..

పాకాల, నవంబర్ 5, ప్రభాతవార్త పాకాల పట్టణంలో సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ ముందు అలాగే తోటపల్లి క్రాస్ రోడ్డు పూరిపేట కూడలిలో, దామలచెరువు రాములు వారి గుడి ముందు అలాగే దిగువ గేట్ క్రాస్ రోడ్డు కూడలిలో సాయంత్రం అయితే చాలు ట్రాక్టర్, ఆటోలు, కార్లు, బైక్లు ఎలా పడితే అలా బ

కార్యదర్శుల కొరతతో గ్రామాల్లో పడకేసిన పాలన

పాలసముద్రం, నవంబర్ 6 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత తీవ్రంగా వుండటంతో పల్లె ప్రాంతాల్లో పాలన పడకేసింది. మండల పరిధిలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు వుండగా కేవలం ఐదు మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఒకొక్క పంచాయతీ కార్యదర్శికి రెండు, మూడు పంచాయతీలకు బాధ్యతలు అప్పగించడంతో వీరు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. పంచాయతీ కార్యదర్శి అంటే గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో వుండాల్సి వుంటుంది. అయితే రెండు, మూడు పంచాయతీలకు ఒకరే పంచాయతీ కార్యదర్శి వుండటంతో ఓ గ్రామం ప్రజలు పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేస్తే తాను మరొక పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అదే సమయంలో మరొక గ్రామానికి చెందిన ప్రజలు పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేస్తే తాను ఆ గ్రామంలో విధులు నిర్వహిస్తున్నానని చెప్తుండటంతో గ్రామ ప్రజలు సమస్యలు పరిష్కారం కాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో పాలన సాఫీగా సాగాలంటే పంచాయతీ కార్యదర్శి కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుంది. గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఇతర సిబ్బందిని పర్యవేక్షిస్తూ ప్రజలను అందుబాటులో వుండి సమస్యలను పరిష్కరించాల్సి వుంటుంది. గ్రామ సచివాలయ పరిధిలో పంచాయతీ కార్యదర్శులే వుండకపోవడంతో సచివాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బందిని కట్టడి చేయడం కష్టం అవుతుంది. సమస్యలపై వచ్చిన ప్రజలకు సరైన సమాధానం చెప్పాల్సి వున్నప్పటికీ మండలంలోని కొన్ని గ్రామ సచివాలయాల్లో ఈ పరిస్థితి కన్పించని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శిగా తాను విధులు నిర్వర్తించే గ్రామానికి వెళ్ళి అక్కడే సాయంత్రం వరకు వుండి గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సి వుంటుంది. అయితే కొన్ని పంచాయతీలకు కొంతమంది గ్రామ కార్యదర్శులు వారంలో ఒక రోజు సైతం వెళ్ళని పరిస్థితి వుంటుంది. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలోనే గ్రామంలో మంచినీటి సమస్య, సిమెంటు రోడ్లు, ఆరోగ్య సమాజం ఆవిష్కరణకు పారిశుధ్య పనులు, వీధి దీపాల నిర్వహణ, ధృవపత్రాల జారీ, పన్నుల వసూలు తదితరాలు నిర్వహించాల్సి వుంటుంది. అయితే కొంతమంది పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు చుట్టపు చూపుగా వెళ్ళి వచ్చి మండల కేంద్రాల నుండి పాలనను సాగిస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో మండల పరిధిలోని పంచాయతీలకు సరిపడ పంచాయతీ కార్యదర్శులను నియమించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా మండల ప్రజలు జిల్లా స్థాయి అధికారులను వేడుకుంటున్నారు.

వార్త ప్రభావం

పచ్చనిపంటను నాశనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

దొరవారిసత్రం, నవంబర్ 6 ప్రభాతవార్త : పంటపై పగ అనే వార్త జాతీయ దినపత్రికలో ఆదివారం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో నివేదికను తయారు చేసి అధికారులకు తెలియ జేశారు. దొరవారిసత్రం మండల పరిధిలోని బూదూరు గ్రామానికి చెందిన సత్తు వరలక్ష్మికి చెందిన 69 సెంట్లు భూమి అదే గ్రామానికి చెందిన చేరెడ్డి జగన్నాథ రెడ్డి పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని అతని అనుచరులతో వారం రోజుల క్రిందట రాత్రి సమయంలో గడ్డి నివారణకు వినియోగించే మందుతో పిచ్చికారి చేసి పంటను నాశనం చేశారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ఆ గ్రామంలో గత కొంత కాలం నుండి పంట పొలాలపై వస్తున్న వివాదాలకు దూరంగా ఉండాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా ఎవరు కూడా వివాద స్పదమైన మాటలు గానీ, కక్షసాధింపు చర్యలు చేపట్టకూడదని వారికి సూచించారు. ఎవరికైనా అన్యాయం జరిగినట్లు తమ వద్దకు వస్తే న్యాయం చేస్తామని ఆయన సూచించారు.

ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

గూడూరు, నవంబర్ 6 ప్రభాతవార్త : మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు హత్యలు, అఘాయిత్యాలను అరికట్టాలి అనే సెమినార్ ప్రోగ్రాంను ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అత్తిలి విమల పాల్గొని మాట్లాడుతూ మహిళలకు దేశ రాజధాని నుండి గ్రామ స్థాయి వరకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. చట్టాలు ఉన్నా అవి డబ్బున్న వాళ్లకు చుట్టాలు అయ్యాయని తెలిపారు. దేశం, రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర మహిళ పై అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, వాటిని నిలువరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు యశ్వంత్, సాయి, ప్రణయ్, సన్నీ, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు రావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆకాంక్షకులు సిఎం చంద్రబాబు

- కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ - కుప్పంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది

కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించే వ్యక్తి సిఎం చంద్రబాబునాయుడు అని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండల కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం మున్సిపల్ ఛైర్మన్‌గా ఇది తన చివరి సమావేశం అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు విజనరీ ఉన్న ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. కుప్పంలో అభివృద్ధి మరలా పరుగులు తీయడం ఖాయమన్నారు.సిఎం చంద్రబాబునాయుడుతోనే కుప్పం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తగా కొనసాగుతానని ప్రజలకు, కార్యకర్తలకు అందు బాటులో ఉంటానన్నారు. పార్టీ పురోభివృద్ధికి తనవంతు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. 2002లో వైద్యుడిగా కుప్పంలో తన ప్రస్థానం మొదలైందన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేశాక మరలా తమ స్వప్రాంతమైన మదనపల్లికి వెళ్లిపోవాలని భావించినట్లు పేర్కొన్నారు. అయితే కుప్పం ప్రాంత ప్రజలకు వైద్యుడిగా సేవలు అందించాలని భావించి ఇక్కడే స్థిరపడ్డానన్నారు. 2009లో తాను శ్రీప్రియ నర్సింగ్‌హోంను స్థాపించి ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం మొదలు పెట్టామన్నారు. ఇలా వైద్య వృత్తిలోనే కొనసాగుతూ ప్రజలకు మరింత సేవ చేయాలనే లక్ష్యంతో తాను దివంగత డా॥ చంద్రమౌళి సూచనలతో వైకాపాలో చేరానన్నారు. 2021 మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తాను వ్యక్తిగత ఇబ్బందులు ఎదుర్కొన్నానని అయితే ఆఎన్నికల్లో వైకాపా తరపున గెలిచి మున్సిపల్ ఛైర్మన్ అయ్యానన్నారు. మూడేళ్ల పాటు ఛైర్మన్‌గా కుప్పం అభివృద్ధికి పనిచేశానన్నారు. ఇక్కడ నలుగురుమంది కమీషనర్లు పనిచేశారని ప్రస్తుత కమీషనర్ శ్రీనివాసరావు కుప్పం అభివృద్ధిలో చూపుతున్న పాత్ర అభినందనీయమన్నారు. కాగా కుప్పం అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని భావించడంతో పాటు తాను కూడా అందులో భాగస్వామి కావాలని భావించి తాను వైకాపా తరపున ఛైర్మన్, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఇంతవరకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ సమావేశంలో టేబుల్ అజెండాగా ఛైర్మన్ రాజీనామా ఆమోదంను ప్రతిపాదించగా హాజరైన కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌ను ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సెల్వరాజ్, జగన్ తదితరులు ఘనంగా సత్కరించారు.

డిఎస్పి ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6 ప్రభాతవార్త : ఉచిత మెగా డిఎస్పి కోచింగ్ కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ ంలో త్వరలో మెగా డిఎస్పి నోటిఫికేషన్ రానున్న సందర్భంగా ఉచిత కోచింగ్ నిర్వహణకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు సంబంధిత అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాలు తిరుపతి నందు చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, కరకంబాడి రోడ్డు నందు గల శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల నందు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు జ్ఞాన భూమి వెబ్‌సైట్ నందు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు 10 గంటల లోపుగా చేరుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరములు తీసుకురాకూడదని అన్నారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు రవాణా శాఖ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్ 7013008498ను సంప్రదించవచ్చన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్, త్రాగునీరు, వైద్య తదితర సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉచిత శిక్షణ కొరకు తిరుపతి జిల్లా నుండి 539 దరఖాస్తులు ఎస్సి, ఎస్టి అభ్యర్థులు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, రవాణా శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్ని సక్రమంగా ఉంటేనే నిర్మాణ అనుమతులు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ పరిధిలో నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో అనధికారిక అపార్ట్మెంట్ల నిర్మాణం, ప్రకటన బోర్డుల రెన్యువల్, భవన నిర్మాణ ప్లాన్ అనుమతులు, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో దరఖాస్తు చేసిన భవన నిర్మాణాలు, అపార్ట్మెంట్ల నిర్మాణాలకు నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఎటువంటి అనుమతులు మంజూరు చేయాలన్నా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వారికే ఇవ్వాలని అన్నారు. నగర పాలక సంస్థ అనుమతులు అధికారికంగా ఉన్న అపార్ట్మెంట్లలోని ఫ్లాట్స్‌కి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులూ కలగవనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడితే తొలగించడం జరుగుతుందని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. నగరంలో ప్రకటన హోర్డింగ్స్‌కి అనుమతులు పరిశీలించి లేని వాటిని తొలగించాలని అన్నారు. అనుమతులు మంజూరులో ఎటువంటి పొరపాట్లు జరిగినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా నగర పాలక సంస్థ తరపున అన్ని అనుమతులు ఉన్న అపార్ట్మెంట్స్, లేఔట్లలో ఫ్లాట్స్ కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని కమిషనర్ ప్రజలకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిసిపి మహాపాత్ర, ఏసిపి బాలాజి, రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

అమలు కాని బాలకార్మిక చట్టాలు

-చితికి పోతున్న చిన్నారుల బ్రతుకులు

వెంకటగిరిరూరల్ నవంబర్ 6 ప్రభాతవార్త:ప్రభుత్వం పేద బాలకార్మిల అభ్యున్నతి కోసం కోట్లు రూపాయులు నిధులు హెచ్చిస్తు ఖర్చు చేస్తున్న అవి వారికి దరికి చెరడం లేదన్న నగ్న సత్యం పట్టణ, గ్రామీణ ప్రాంతాలల్లో రోజు రోజుకి పెరుగుతన్న జనాభకు అనుగుణంగా పేద బాల కార్మికులు సంఖ్య కూడా అధికంగా పెరుగుతుంది. అయితే ప్రభుత్వం అనేక పధకాలు ప్రవేశ పెట్టి బాలకార్మిక వ్యవస్థను రూపుమాపలనే ఉద్దేశ్యంతో హెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయ తప్ప అమలు మాత్రం కావడం లేదని విమర్శులు వ్యక్తం అవుతున్నాయి.వెంకటగిరి పట్ణ గ్రామాణ ప్రాంతలల్లో ప్రతి నిత్యం బాలకార్మికులు చెత్తా కాగితాలు ఏరుకోని వాటిని విక్రయించుకోని తమ జీవనం సాగిస్తున్నరు.ప్రభుత్వ చట్టాలు మాత్రం నీరు కారిపోతున్నాయి.బాల కార్మికులు బ్రతుకులు మాత్రం చితికి పోతన్నయి.ఇప్పటికైన సంబందిత ఉన్నతాదికారులు చోరవ తీసుకోని గ్రామీణ,పట్టణ ప్రాంతలల్లో ఉన్న బాల కార్మికులు బడిలో చెర్పించేవిదంగా చర్యలు తీసుకోవాలని అందుకు ప్రభుత్వం స్వశ్చంద సంస్థలు ముందుకు రావల్సి అవసరం ఎంతైన ఉందని స్దానికులు అంటున్నారు.

ఓపన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో విద్యార్థి యశ్విన్ ప్రతిభ

గూడూరు, నవంబర్ 6 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి యశ్విన్ తమిళనాడు ఓపన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో అండర్ 9, 11 క్యాటగిరిలలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌కు ఎంపిక అయినట్లు స్కూలు కరస్పాండెంటెంట్ ఎం. శివకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా యస్విన్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడతూ గూడూరు నుండి రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌కి ఎంపిక అవ్వడం అభినందనీయమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిడి చైతన్య, ఉపాధ్యాయులు మస్తాన్ బీ, సుప్రజ, రఫీ, హరిత, నాసీరా, ధన శ్రీ, సుప్రియ, సమ్రిన్, శరీష, ఉమ, హరిత, యాన్సీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

3,300 కేజీల బియ్యం మాయం

కోట, నవంబర్ 6 ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ కోటలోని శ్యామసుందరపురంలోని పాత డీలరు వద్ద 3,300 కేజీలు బియ్యం మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు చెప్పారు. శ్యామసుందరపురం డీలరు పరిధిలో రవినగర్, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ, మరికొన్ని కుటుంబాల వారు రేషన్ బియ్యం తెచ్చుకుంటారు. ఈ క్రమంలో ముందుగా ఎవరైతే వెళతారో వారికి మాత్రమే డీలరు బియ్యం ఇచ్చేవారని, వెనుక వెళ్లిన వారికి బియ్యం అయిపోయాయని, రేపు, ఎల్లుండి అంటూ కాలయాపన చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. కూలీ పనులు సైతం ఎగ్గొట్టి రేషన్ బియ్యం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితుల ఆరోపణగా ఉంది. ఇదే విషయమై వాకాడు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావును 'ప్రభాతవార్త' వివరణ కోరగా 3,300 కేజీల బియ్యం డీలరు వద్ద తక్కువగా ఉండటం వాస్తవమని అంగీకరించారు. అయితే డీలరు వేలిముద్రలు వేసుకోకుండా హడావుడిగా కార్డుదారులకు బియ్యం ఇచ్చేశారని, అందువలన తేడాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

యోగా ఉద్యోగం పేరుతో రూ.2.5లక్షల ఎగనామం

-దేశం నాయకులపై బాధితుని తండ్రి ఫిర్యాదు

పుంగనూరు,నవంబరు 6 ప్రభాతవార్త : తమ పంచాయతీకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తన కుమారుడికి ఉన్నత పాఠశాలలో యోగా టీచర్ పోస్టు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.2.5లక్షలు తీసుకుని మాట దాటేశారని మంగళంకు చెందిన టి.కృష్ణప్ప ఆవేదన చెందారు. ఈమేరకు ఆయన పట్టణంలో బుధవారం మధ్యాహ్నం విలేకరులతో తన గోడు వెళ్ళబోసుకున్నాడు. తనకుమారుడు భాస్కర్ నిరుద్యోగిగా ఉండడంతో అతనికి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.ఈక్రమంలో కంగానెల్లూరుకు చెందిన దేశం నాయకులు చెన్నకేశవ,జయశంకర్‌లు తన కుమారుడుకి యోగా టీచర్‌గా ఉద్యోగమిప్పిస్తామనిచెప్పి రూ.2.5లక్షలు తీసుకున్నారన్నారు. అయితే,నెలలు గడచినా ఆ ఉద్యోగం మాటలేకపోవడంతో పాటూ తనకు సమాధానమివ్వడం లేదన్నారు. అంత పెద్ద మొత్తాన్ని వెంటనే తిరిగి ఇవ్వాలని లేనిపక్షంలో తమ కుటుంబానికి ఆత్మహత్య శరణ్యమని వివరించారు.

పేరూరు చెరువులో తెలుగు తమ్ముళ్ళ అరాచకం!

-టిప్పర్ మట్టి రూ.7వేల రుపాయాలకు విక్రయం -యథేచ్ఛగా మట్టి మాఫీయా విజృంజన
-భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని స్థానికుల ఆవేదన

తిరుపతిరూరల్,నవంబర్ 6 ప్రభాతవార్త: పేరూరు చెఱువులో మట్టిని అనధికారికంగా విక్రయిస్తూ తెలుగు తమ్ముళ్ళు కోట్ల రుపాయాలు ఆర్జిస్తున్నారని పేరూరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు పేరూరు చెఱువులో 30 టిప్పర్లు, 8జెసిబిల సాయంతో మట్టిని తోడేస్తూ... కోట్లా రుపాయాలు అనధి కారికంగా తెలుగు తమ్ముళ్లు సంపాదిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇలానే చెఱువులో యంత్రాల సాయంతో చెఱువులో 10, 15 అడుగుల మేర లోతు తవ్వేస్తూ, స్వలాభమే ధ్యేయంగా విచ్చలవిడిగా మట్టిని అమ్ముకొంటు న్నారని స్థానికులు వాపోతున్నారు. దాదాపుగా 303 ఎకరాలు ఉన్న పేరూరులో చెఱువులో మట్టి మాఫీయా అక్కడే తిష్టవేసి ప్రతిరోజు వందల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తరలిస్తూ కోట్లరూపాలను అక్రమార్జన చేస్తున్నానరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరూరు చెఱువులో మట్టిని రుచిమరిగిన మట్టి మాఫీయా గ్యాంగ్ రాత్రి, పగలు అక్కడే తిష్టవేసి జెసిబిల సాయంతో రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని విక్రయించి సోమ్ముచేసుకొంటున్నారని ఆరోపించారు. ఒక్కో మట్టి టిప్పర్‌ను రూ.7వేల రుపాయాలకు విక్రయిస్తూ అక్రమ ఆర్జనకు తెర తీసారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చూసిచూడనట్లుగా మట్టి వ్యాపారం జరిగిన విషయం అందరికి తెల్సిందే. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్కలేటర్ల సాయంతో విచ్చలవిడిగా చెఱువును మట్టిని తవ్వేసి లక్షల రుపాయాలు అక్రమ ఆర్జన చేస్తున్నారు. పేరూరు చెఱువులో అనధికారిక మట్టి విక్రయంపై పేరూరు వాసులు ముత్యాలరెడ్డిపల్లి పోలిస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్వయాన తిరుపతిరూరల్ స్టేషన్ సి.ఐ. సంఘటన స్థలానికి చేరుకుని ఇకపై పేరూరు చెఱువులో అనధికారిక మట్టి తవ్వకాలు జరగవని, మట్టి తరలింపును నియంత్రిస్తామని పేరూరు వాసులకు రూరల్ సి.ఐ. గట్టి హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. కానీ అనధికారిక మట్టి విక్రయం మాత్రం యదేచ్ఛగా కొనసాగుతుందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పేరూరు చెఱువులో జరుగుతున్న అక్రమ మట్టి వ్యాపారంపై దృష్టి సారించి, భవిష్యత్ తరాలకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

తండ్రి కలలను సాకారం చేస్తున్న తనయుడు

పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు జి.విజయకుమార్

శ్రీకాళహస్తి నవంబర్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆలోచనల్ని ఆచరణలో పెట్టడంలో ఆయన తనయుడు శాసనసభ్యులు బొజ్జల సుదీర్‌రెడ్డి చొరవ చూపుతున్నారని పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు అన్నారు.బుధవారం ఆయన ఏరియా ఆసుపత్రి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు. ఐదేళ్ళ పాటు ఇక్కడ అభివృద్ధి గురించి వైకాపా పాలకులు పట్టించుకోలేదన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి గెలిచిన వెంటనే తండ్రి ఆశయాలు,ఆశించిన అభివృద్ధికి సంబంధించి చొరవ చూపుతున్నారన్నారు. మొదటి దశలో వాకింగ్ ట్రాక్ గా తీర్చి దిద్దుటకు శ్రీకారం చుట్టారన్నారు.అలాగే విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేడియం దుస్థిని బాగు చేయటానికి చర్యలు తీసుకున్నారని విజయకుమార్ నాయుడు వివరించారు. మొదటి దశలో రూ.9లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను రూపొందించారని త్వరలోనే దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. పార్లమెంట్ పార్టీ కోశాధికారి కంఠారమేష్, ఎంఎస్‌రెడ్డి, గుత్తా విజయకుమార్, మనోజ్,ప్రవీణ్, లక్ష్మీనారాయణ గుప్తాలు పాల్గొన్నారు.

వడ్డెరులు ఇప్పుడు గుర్తొచ్చారా?

వడ్డెర రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య

శ్రీకాళహస్తి నవంబర్ 6 ప్రభాతవార్త : వడ్డెరులు మాజీ మంత్రి రోజమ్మకు ఇప్పుడు గుర్తుకొచ్చారా? అని వడ్డెర విజయభేరి రాష్ట్ర అధ్యక్షులు బండా రామచంద్రా వడ్డె ధ్వజమెత్తారు. బుధవారం శ్రీకాళహస్తికి వచ్చిన ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హాయాంలో చిత్తూరుజిల్లా పెనుమూరు మండలంలోని వేణుగోపాలపురానికి చెందిన ఇంటర్‌మీడియట్ చదువుతున్న భవ్యశ్రీని మాయమాటలు చెప్పి నమ్మించి వంచించి, అత్యాచారానికి పాల్పడి చంపి బావిలో వేసినపుడు తప్పుడు నివేదికలతో కేసును మాఫీ చేసిన విషయం వడ్డెరులందరికి తెలిసిందే. ఇంకా మరచిపోలేదని రామచంద్రా వడ్డె రోజా విమర్శలను తప్పుపట్టారు.వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలోని వడ్డెరులందరూ తమకు రక్షణ లేదని తమ బిడ్డలకురక్షణ కరువైందని వేడుకున్నా పట్టించుకోలేదని నాడు తమ బాధలను కలెక్టర్‌కు విన్నవించుకొనుటకు వెళ్ళటానికి కూడా అనుమతి లేకుండా 144 సెక్షన్ విధించి అరెస్టు చేసిన ఘనత వైకాపాకు అప్పటిలో జిల్లాలో ప్రాతినిద్యం వహిస్తున్న మహిళా మంత్రి రోజాకు దక్కిందన్నారు. తన నియోజకవర్గంలో వడ్డెర్లకు అన్యాయం జరిగితే అఘాయిత్యానికి పాల్పడిన వారికి మద్దతు ఇచ్చిన ఆర్కె రోజా నేడు చిలక పలుకులు పలుకుతూ మహిళా మంత్రిని ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రిని దూషించటం హాస్యాస్పదమన్నారు.

సామాన్యుడిలా ఛైర్మన్ నాయుడు అన్నప్రసాదం స్వీకరణ

తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బిఆర్‌నాయుడు కుటుంబంతో కలసి సామాన్యభక్తుల్లాగా అన్నప్రసాదాలు స్వీకరించారు. బుధవారం రాత్రి అన్నప్రసాదం కాంప్లెక్స్‌కు కుటంబసభ్యులతో చేరుకుని భక్తులతో కలసి సమానం